సాక్షి
వికారాబాద్
శనివారం ‍। 22 ‍। ఫిబ్రవరి ‍। 2025



అవగాహన అవసరం

రైతులు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలనేది తెలుసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. 8లో ▸



విజిలెన్స్ తనిఖీలు

తాండూరు మున్సిపల్ భవనంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృంద సభ్యులు తనిఖీలు చేపట్టారు. 8లో ▸



ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌ను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

స్పీకర్‌కు అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ సంస్థ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మ్యాన్ ఆఫ్ అన్‌పారాలెల్డ్ మస్టరే అవార్డుతో సత్కరించింది. గురువారం రాత్రి నగరంలోని రవీంద్రభారతిలో గురువారం శృతిలయ సీలెవెల్ కార్పొరేషన్ -కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సినీనటి, దర్శకురాలు విజయనిర్మల జయంతి సందర్భంగా విజయకృష్ణా సిల్వర్ క్రౌన్-2025 అవార్డు, జంధ్యాల 75 వసంతాల వజ్రోత్సవ సంచిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు ప్రదానం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి
సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న 29 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. సంబంధిత వ్యక్తులకు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీసు శాఖ నిరంతరం ప్రజలు, వారి ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తుందని తెలిపారు. కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, రాజు, హెడ్‌కానిస్టేబుల్ గిరి, కృష్ణ, సంతోష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఎండీని కలిసిన మల్లురవి



అశోక్‌చంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశోక్‌చంద్రను నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో ఆయన్ని ఎంపీ కలిసి నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో ఉన్న అన్ని మండలాలలో యువతకు ఉపాధి కల్పించడానికి విరివిగా రుణాలు అందించాలని కోరారు.

డిస్కస్ త్రో, షాట్ పుట్‌లో వెండి పతకాలు

శంకర్‌పల్లి: ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి డిస్కస్ త్రో, షాట్ పుట్ పోటీల్లో శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామానికి చెందిన వరుణ్ గౌడ్ ప్రతిభ చాటాడు. రెండు విభాగాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించాడు. ప్రస్తుతం వరుణ్‌గౌడ్ బాసర ఐఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడంతో మార్చి 20న పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తమ కుమారుడి ప్రతిభపై తల్లిదండ్రులు కల్పన, లక్ష్మణ్ హర్షం వ్యక్తంచేశారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

లక్డీకాపూల్: వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)వెంకటాచారి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాలో ఇంటర్ పరీక్షలను 244 కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నపత్రాల తరలింపులో పోలీసులు అత్యంత బాధ్యత, భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సమయానుకూలంగా పరీక్ష కేంద్రాలకు చేరేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని.. క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రాల లొకేషన్‌లను పరిశీలించుకోవాలన్నారు. సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 040 29700934ను సంప్రదించవచ్చని సూచించారు.



సిడె ఉత్సవం సందర్భంగా భక్తజన సంద్రమైన ఆలయ పరిసరాలు

పోలేపల్లి.. వరాల తల్లి

సిడె ఉత్సవానికి భారీగా భక్తజనం

- రేణుకా ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగిన ప్రాంగణం
- ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రులు, నేతలు



స్వయంభుగా వెలిసిన రేణుకా ఎల్లమ్మ తల్లి జననం మహిమాన్వితం. రాతిరూపంలో కొలువైన అమ్మవారు భక్తజన కల్పవల్లి. కోరిన కోర్కెలు తీర్చే సిరుల తల్లిగా ప్రసిద్ధి. ప్రధాన ఘట్టమైన సిడె ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాల నడుమ బోనాలు, ఘటాలు ఎత్తుకుని వెళ్లి ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. ప్రదక్షిణలో గవ్వలు, బండారు చల్లడంతో ఆ ప్రాంతమంతా పసిడి వర్ణమయింది. – బొంరాస్‌పేట



సీఎంకు మొక్క ఇచ్చి ఆహ్వానం పలుకుతున్న కలెక్టర్



బోనంతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



ఘటం ఊరేగింపు



బోనమెత్తిన మహిళ

వివరాలు 8లో ▸



ఆర్టీసీ బస్ డ్రైవర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

- రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ బాలాజీ
- చేవెళ్లలో డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ బాలాజీ హెచ్చరించారు. చేవెళ్ల మండల పరిధి పామెన బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వాహనదారులకు అవగాహన కల్పించారు. మత్తులో వాహనాలు నడిపితే.. వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో నమ్ముకున్న వారి గురించి ఆలోచించుకోవాలని సూచించారు. క్షేమంగా ఇంటికి తిరగి వస్తారని ఇంటి వద్ద తల్లిదండ్రులు, భార్య పిల్లలు, కుటుంబ సభ్యులంతా ఎదురు చూస్తుంటారని, వారి ఆశలను మీ నిర్లక్ష్యం వలన అడియాశలు చేయరాదని చెప్పారు. ప్రతి ఒక్కరికీ తమకు తాముగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలనే ఆలోచన రావాలని, అలా చేస్తే.. ప్రమాదాలను అరికట్టవచ్చిన స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో అన్ని వాహనాలను తనిఖీ చేశామని, ఆర్టీసీ బస్ డ్రైవర్లను పరీక్షించామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 24 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, 12 ద్విచక్ర వాహనాలు, 12 కార్లు సీజ్ చేశామని వెల్లడించారు.

పట్టుకుంటారా.. తప్పిస్తారా?

- దొరకని కోడి పందేల సూత్రధారులు
- పది రోజులు దాటినా అదే పరిస్థితి
- పోలీసుల వ్యవహారంపై సర్వత్రా ఆరోపణలు



కోడి పందేలు నిర్వహించిన వ్యవసాయ క్షేత్రం ఇదే

మొయినాబాద్: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కోడి పందేల కేసులో అసలు సూత్రధారులు తప్పించుకు తిరుగుతున్నారు. పారిపోయి పది రోజులు దాటినా ఇంత వరకు దొరకలేదు. వారిని అటునుంచి అటే తప్పించే ప్రయత్నం జరుగుతోందనే ప్రచారం ఊపందుకుంది. తోలుకట్టలో ఉన్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 11న పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వస్తుండగా ఎస్ఓటీ, స్థానిక పోలీసులు దాడి చేసి పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో కోడి పందేల నిర్వాహకుడు శివకుమార్ వర్మ(గబ్బర్‌సింగ్)తోపాటు 64 మందిని పోలీసులు పట్టుకోగా మరికొంత మంది పారిపోయిన విషయం విదితమే. కాగా పోలీసులు దాడి చేసిన సమయంలో కోడి పందేల నిర్వహణకు అసలు సూత్రధారి అయిన వ్యక్తి అక్కడే ఉన్నట్లు సమాచారం. సదరు సూత్రధారి పోలీసులకు తెలిసినా అతన్ని తప్పించేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. పందెం రాయుళ్ల వద్ద రూ.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చూపిన పోలీసులు.. ఆ రోజు రూ.కోట్లలో డబ్బులను మాయం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికైనా కేసుతో సంబంధం ఉన్న వారిని పట్టుకుంటారా..? వదిలేస్తారా వేచి చూడాల్సిందే.

టీ–డయోగ్నస్టిక్స్.. సేవలు అదుర్స్

- ఉదయం నమూనాల సేకరణ
- సాయంత్రం వరకు ఫలితాలు
- నేరుగా రోగి మొబైల్‌కే రిపోర్ట్స్
- ఒకే చోట 134 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు
- వికారాబాద్ కేంద్రంగా మూడు జిల్లాలకు సేవలు



వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన రోగనిర్ధారణ పరీక్షా కేంద్రం

వికారాబాద్: పేద, మధ్యతరగతి రోగుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మూడన్నరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన టీ-హబ్(టీ-డయోగ్నస్టిక్ హబ్) రోగనిర్ధారణ కేంద్రం సత్ఫలితాలిస్తోంది. రూ.1.59 కోట్ల వ్యయంతో జిల్లా కేంద్రంలో ప్రారంభించిన ఈ కేంద్రంలో మరిన్ని నిధులు కేటాయించి అదనపు పరీక్షలు పెంచారు. ప్రస్తుతం ఇక్కడ వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 33 పీహెచ్‌సీల పరిధిలోని ప్రజలకు సేవలందిస్తున్నారు. టీ-హబ్ ఏర్పాటు చేసిన మూడున్నరేళ్ల వ్యవవధిలోనే 55.86 లక్షల టెస్టులు నిర్వహించారు. అధునాతన యంత్ర పరికారాల సాయంతో త్వరితగతిన రిపోర్టులు ఇస్తున్నారు. ప్రైవేటు డయోగ్నస్టిక్స్‌లలో వేలకు వేలు చదివించుకునే బదులుగా టీ-హబ్ సేవలు వినియోగించుకుంటే డబ్బు ఆదా అవుతోంది. విస్తృతస్థాయిలో ప్రచారం కల్పిస్తే ఎక్కువ మందికి ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తొలుత 57.. ప్రస్తుతం 134 టెస్టులు

గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఓ విభాగంలో 2021 జూన్ 2న రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రం ప్రారంభించింది. రూ.1.59 కోట్లు వెచ్చించి ఈ ల్యాబ్‌లో అధునాతన యంత్ర పరికరాలు ఏర్పాటు చేశారు. తదనంతరం మరిన్ని నిధులు విడుదల చేసి టెస్టుల సంఖ్య పెంచారు. తొలుత 57 రకాల పరీక్షలు నిర్వహించే సదుపాయం కల్పించిన వైద్యారోగ్య శాఖ తదనంతరం వాటిని 134కు పెంచింది. ఇక్కడ రక్త పరీక్షలు మొదలుకుని డెంగీ, చికున్‌గన్యా, ఏఎన్సీ ప్రొఫైల్, హీమోగ్రామ్, కిడ్నీ, లివర్ ఫంక్షనింగ్, హెచ్‌బీఏ-1 సీ, విటమిన్-డీ, బీ-12, థైరాయిడ్ ప్రొఫైల్, డయాబెటిక్ ప్రొఫైల్, ఫీవర్ ప్రొఫైల్ తదితర పరీక్షలన్నీ అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల రోగులకు రూ.500 నుంచి రూ.4వేల వరకు ఆదా అవుతున్నాయి.

మూడు జిల్లాలకు సేవలు

టీ-హబ్‌లో మూడు జిల్లాలకు చెందిన పీహెచ్‌సీల నుంచి శాంపిళ్లు వస్తాయి. మధ్యాహ్నం వరకు రోగుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తారు. వీటిని భద్రపరిచి ఆరు వాహణాల ద్వారా మధ్యాహ్నం 3గంటలకు వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ కేంద్రానికి తరలిస్తారు. నిపుణులైన ల్యాబ్ టెక్నీషియన్లు గంట నుంచి రెండు గంటల వ్యవధిలో పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఆయా పీహెచ్‌సీలకు ఆన్‌లైన్‌లో చేరవేస్తారు. సాయంత్రం లోగా రోగి మొబైల్‌కు సందేశం రూపంలో నిర్ధారణ ఫలితాలు అందిస్తారు. వీటి ఆధారంగా వైద్యులు ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తారు. తొలినాళ్లలో రోజుకు 30 నుంచి వంద వరకు రక్తనమూనాలు రాగా ప్రస్తుతం రోజుకు 300 నుంచి 450 వరకు శాంపిళ్లు వస్తున్నాయని ల్యాబ్‌నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు 3,12,466 రోగుల నుంచి 5,69,126 శాంపిళ్లు వచ్చాయి. 987834 రకాల ఫీవర్ ప్రొఫైల్స్ నిర్వహించి మొత్తం 55,86,826 టెస్టులు నిర్వహించి రోగులకు ఫలితాలు అందజేశారు.

టీ-హబ్ సేవలు

జిల్లా	సెంటర్లు
వికారాబాద్	22 పీహెచ్‌సీలు, వికారాబాద్ జనరల్ ఆస్పత్రి, పరిగి, కొడంగల్ ఆస్పత్రులు
రంగారెడ్డి	తొమ్మిది సెంటర్లు
సంగారెడ్డి	జహీరాబాద్ పీహెచ్‌సీ



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అధునాతన యంత్రాలు

కచ్చితమైన ఫలితాలు



రోగులకు నిర్వహించే అన్ని నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రోగులు తమ సమీపంలోని పీహెచ్‌సీలో రక్తనమూనాలు ఇస్తే సాయంత్రం వరకు కచ్చితమైన ఫలితాలతో రిపోర్టు వారి ఫోన్‌కు పంపిస్తాం. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యానికి చేసే ఖర్చు ఆదా అవుతుంది. ప్రభుత్వం కల్పించే ఈ సదుపాయాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, టీ-హబ్ ఇన్‌చార్జి, వికారాబాద్

క్లుప్తంగా

టిప్పర్, లారీ ఢీ..

పరిగి: మట్టిని అక్రమంగా తరలించే క్రమంలో ఓ టిప్పర్ డ్రైవర్ అతివేగంతో ఎదురుగా లారీని ఢీకొట్టాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మన్నెగూడ వైపు నుంచి మట్టిలోడ్‌తో పరిగివైపు వస్తున్న టిప్పర్ పట్టణ కేంద్రంలోని ఏబీఎస్ ప్లాజా వద్ద కొడంగల్ వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జయి డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదే విషయమై ఎస్‌ఐ సంతోశ్‌కుమార్‌ను వివరణ కోరగా లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్

ఇద్దరికి గాయాలు

కుల్కచర్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కామునిపల్లి గ్రామానికి చెందిన సూరి గ్రామంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో పీరంపల్లి గ్రామానికి చెందిన శివ బైక్‌పై కుల్కచర్లవైపు వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతున్న సూరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్సలతో టీబీ దూరం

- 60 ఏళ్లు దాటిన వారికి త్వరలో వ్యాక్సిన్
- టీబీ కోఆర్డినేటర్ రాజు



టీబీ వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

దోమ: టీబీ వ్యాధిపై ఆందోళన వీడాలని టీబీ కోఆర్డినేటర్ రాజు, సూపర్‌వైజర్ వజ్రమాల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దాదాపూర్‌లో టీబీ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందని.. 60 ఏళ్లు దాటిన వారికి త్వరలో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని చెప్పారు. టీబీ వ్యాధిగ్రస్తులకు చికిత్స నిమిత్తం రూ.వేయి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, చంద్రకళ, మాధవి, లక్ష్మి, గౌరమ్మ, అంజమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కడ్తాల్: ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన కడ్తాల్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధి మద్దెలకుంటతండాకు చెందిన సున్నావత్ సరళ(30).. ఆరోగ్యం బాగలేదని, కడ్తాల్‌కు వెళ్లి ఆస్పత్రిలో చూపించుకుని వస్తానని ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. ఆమె కోసం ఐదు రోజులుగా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. సరళ తల్లి నీలా శుక్రవారం కడ్తాల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయం వద్ద భక్తుల కిటకిట





సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐజీ

పోలేపల్లి.. వరాల తల్లి

బొంరాస్‌పేట: 'సిడెపై దర్శనమిచ్చే.. సిరులనిచ్చే తల్లి.. రేణుకా ఎల్లమ్మ.. రావమ్మా!'.. అంటూ భక్త కోటి కేకలు.. జమిడికె నాదాలు.. ఒగ్గుడోలు చప్పుళ్లతో ఎల్లమ్మ జాతర ప్రాంగణం మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలేపల్లి భక్తజన సంద్రమైంది. సాయంత్రం మేతరి తలపై జల్దికుండతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదట ఉన్న సిడె తొట్టెలలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. సిడె సందర్భంగా కిక్కిరిసిన భక్తులు గవ్వలు, బండారు చల్లి తరించారు.

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి దర్శనం

పోలేపల్లి ఎల్లమ్మ తల్లిని ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. జాతరకు హాజరైన సీఎంకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సీఎం అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. హోమ గుండం వద్ద ప్రత్యేక పూజల అనంతరం సన్మానం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంబంధించిన పాట వీడియోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన భక్తులకు అభివాదం చేసుకుంటూ వెళ్తుండగా పెద్ద ఎత్తున పూల వర్షం కురిపించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, రేవంత్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, జగదీశ్వర్‌రెడ్డి, ముద్దప్ప దేశ్‌ముఖ్, వెంకట్రాములు, నర్సింలుగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, ఈఓ రాజేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకటేశ్ పాల్గొన్నారు.

మిర్చీ ఘాటు.. తెచ్చిన చేటు

- బస్సు దించేసిన కండక్టర్
- బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం



చికిత్స పొందుతున్న నర్సమ్మ

తాండూరు రూరల్: కారంపొడి పట్టించుకొచ్చేందుకు వెళ్లిన ప్రమాదంలో గాయపడింది. ఈ ఘటన పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. రుక్మాపూర్ గ్రామానికి చెందిన తోపాజీ నర్సమ్మ తాండూరులో కారం పొడి పట్టించుకు వచ్చేందుకు ఎండుమిర్చి బస్తాతో బస్సు ఎక్కింది. బస్సులో ఘాటు రావడంతో కొంత దూరం వెళ్లాక కండక్టర్ నర్సమ్మను దింపివేశాడు. దీంతో ఆమె భర్త చంద్రప్పకు విషయం చెప్పడంతో ఆయన బైక్‌తీసుకుని నర్సమ్మ వద్దకు వెళ్లాడు. దంపతులు తాండూరుకు చేరుకున్నాక మెట్రోమనీల హోటల్ వద్ద వీరి బైక్‌ను ఆటో ఢీకొట్టింది. దీంతో నర్సమ్మ కాలు విరగడంతో పాటు కంటికి గాయమవగా చంద్రప్పకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కండర్ బస్ దింపడం వలే ఇలా జరిగిందని కండక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. నాలుగు రోజులకు బాలిక ఆచూకీ లభ్యం కాగా.. పోలీసులు శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొంగ్లూర్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ 2వ సంవత్సరం చదువుతున్న ఏ.మంజు(16) ఈ నెల 16న కళాశాల నుంచి అదృశ్యమైంది. కళాశాల యాజమాన్యం ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలిక కోసం గాలించగా.. ఆచూకీ లభ్యమైంది. విద్యార్థిని దొరకడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలిపై లైంగిక దాడి

- రెండు నెలల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘటన
- అన్నీ తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులు
- ఉన్నతాధికారుల సీరియస్.. చర్యలకు సిద్ధం



యాచారం పోలీస్ స్టేషన్ కార్యాలయం

యాచారం: మతిస్థిమితం లేని, వృద్ధ యాచకురాలిపై గుర్తు తెలియని కామాంధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా యాచారంలోని మాల్ మార్కెట్ ఎస్‌బీఐ వద్ద గతేడాది డిసెంబర్ 9న అర్ధరాత్రి ఓ వృద్ధురాలు(70) సేద తీరుతుంది. జనసంచారం లేకపోవడంతో ఓ వ్యక్తి ఆమెపై బలత్కారానికి పాల్పడి, తీవ్రంగా గాయపర్చాడు. ఈ విషయమై అదే రోజు రాత్రి యాచారం పెట్రో మొబైల్ పోలీసులకు సమాచారం అందడంతో ఉన్నతాధికారులకు తెలియజేశారు. కానీ దుండగుడిని పట్టుకుని, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహించారు. ఎస్‌బీఐ సమీపంలోని ఓ దుకాణా వ్యాపారి రెండు రోజుల క్రితం సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ కామాంధుడు ఆమెపై బలత్కారానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

వేటుకు రంగం సిద్ధం

ఘటన జరిగి రెండు నెలలు గడవడం, సమాచారం తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విషయం వెలుగులోకి రావడంతో రెండు రోజుల క్రితం కేసు నమోదు చేయడంపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇంటలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల ద్వారా విచారణ చేపట్టి పూర్తి సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఘటనలో నిర్లక్ష్యంగా వ్యహరించిన పోలీసు ఉన్నతాధికారులు, పెట్రో మొబైల్ సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే విషయమై యాచారం సీఐ నర్సింహరావును సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో డ్రైవర్ మృతి



సుబ్రహ్మణ్యం మృతదేహం

కొత్తూరు: అనారోగ్యంతో ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధి తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహ్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం(55) తిమ్మాపూర్‌లోని హెచ్‌ఐఎల్ పరిశ్రమకు సిమెంట్ పైపుల లోడ్ నిమిత్తం వచ్చాడు. ఈ క్రమంలో పరిశ్రమ వెనకాలకు బహిర్భూమికి వెళ్లిన డ్రైవర్.. ప్రహరి పక్కన చలనం లేకుండా పడి ఉన్నాడు. కొద్ది సేపటి తర్వాత అతడితో పాటు వచ్చిన తోటి డ్రైవర్ దురాయిరాజ్.. విషయాన్ని పరిశ్రమ నిర్వాహకులకు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని సహ డ్రైవర్ తెలపగా.. ఈ కారణంగానే మృతి చెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా సందల్ ఊరేగింపు



గంధం ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తదితరులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ షర్ఫొద్దీన్ బాబా దర్గా 759వ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ తరఫున సందల్(గంధం) ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీలో భాగంగా ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డిలు మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డిలు తలపై పూలు, ఛాదర్ పెట్టుకొని ఊరేగింపుగా దర్గాపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీలు ఫరీదుద్దీన్, ఇర్ఫాన్‌లు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊరేగింపులో పోలీసు సిబ్బంది ఉత్సాహంగా ముందుకు కదిలారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శ్రీను, లక్ష్మణ్, దయాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగుపై అవగాహన అవసరం

తాండూరు వ్యవసాయ క్షేత్రం ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్



చిత్రపటాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ధారూరు: రైతులు తమ పొలాల్లో ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలనేది తెలుసుకోవాలని తాండూరు వ్యవసాయ క్షేత్రం ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని కేరెళ్లిలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ కృషి అనుభవ్, గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆర్థిక, సామాజిక పరిస్థితులను గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలతో తెలుసుకోవచ్చన్నారు సాగుచేసిన పంటల్లో సస్యరక్షణ పద్ధతులు, సాగులో అనుసరించాల్సిన మెళకువలు, సూచనలు, కాలానుగుణంగా తీసుకోవల్సిన పనులపై రైతులకు వివరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వెన్‌డయాగ్రాం, ట్రాంసెక్ట్ వాక్, చపాతిపటం, సమస్య చెట్టు, సామాజిక పటం తదితర చిత్రపటాలను గీచి వాటి గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమలో శాస్త్రవేత్త యమునారెడ్డి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లితో సమానం



కందనెల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను సన్మానిస్తున్న మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం

కందనెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

తాండూరు రూరల్: జీవితంలో ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ.. మాతృభాష తల్లితో సమానమని ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం కందనెల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల్లో 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మాతృభాషలో చదవటం, రాయడం, మాట్లాడటం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు తెలుగు అందించి మాతృభాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మాతృ భాష అమ్మ వంటిదని మనం ఎక్కడికి వెళ్లినా తల్లిని గుర్తు పెట్టుకున్నట్లు మాతృభాష మీద సైతం మమకారాన్ని మరవకూడదని చెప్పారు. అనంతరం వడిచర్ల సత్యం రచించిన మణిపూసలను వందకు పైగా కంఠస్థం చేసిన మహేష్, శృతిని మణిపూసల కంఠభూషణ పురస్కారంతో సత్కరించారు. తెలుగుభాషను బోధిస్తున్న ఉపాధ్యాయులు వడిచర్ల సత్యం, పద్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శెట్టి శివకుమార్, ఉపాధ్యాయులు శివప్రసాద్, శోభారాణి, అనురాధ, ప్రవీణ్‌జాదవ్, జరీనా, రాధాకృష్ణ, సంతోశ్ కుమార్, బస్వరాజ్, రమాదేవి, సీతా లావణ్య, స్వప్న, రాఘవేందర్, నర్సింలు పాల్గొన్నారు.

తాండూరులో విజిలెన్స్ తనిఖీలు

- మున్సిపల్‌లో భవన నిర్మాణంలో నిధుల దుర్వినియోగంపై విచారణ
- వివరాలు సేకరించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



మున్సిపల్ భవన కొలతలు తీసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ భవన నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ అందిన ఫిర్యాదుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృంద సభ్యులు తనిఖీలు చేపట్టారు. ఈమేరకు శుక్రవారం డీఈ, ఇద్దరు ఏఈలతో కూడిన బృందం మున్సిపల్ భవన నిర్మాణ తీరుపై విచారణ నిర్వహించారు. నిర్మాణ ఏరియా, గదుల కొలతలు, నాణ్యత తీరు తదితర అంశాలపై వివరాలు, కొలతలు తీసుకున్నారు. 2016లో రూ.3.47 కోట్ల వ్యయంతో మున్సిపల్ భవనాన్ని నిర్మించారు. పలు కారణాలతో ఇది ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఆతర్వాత మరో రూ.76 లక్షల అదనపు నిధులను వెచ్చించి, 2021 అక్టోబర్‌లో అందుబాటులోకి తెచ్చారు. అయితే నిర్మాణంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు అందడంతో శుక్రవారం విజిలెన్స్ బృంద సభ్యులు భవన నిర్మాణ తీరు, ఖర్చయిన నిధులపై తనిఖీలు చేపట్టారు. ఈ విషయమకై విజిలెన్స్ అధికారిని వివరణ కోరగా.. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచామని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు చేరవేస్తామని తెలిపారు.

నందుకు గవర్నర్ అభినందనలు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో నందు కుటుంబ సభ్యులు

అనంతగిరి: వడ్ల నందు ఫౌండేషన్ చైర్మన్‌ను గురువారం రాత్రి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో, కోవిడ్ లాంటి ఆపత్కర సమయంలోనూ గ్రామాల్లో శానిటేషన్‌కు సహకరించిన ఆయన తీరును తెలుసుకుని రాజ్‌భవన్‌కు పిలిపించారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న నందును అభినందించిన ఫౌండేషన్ నుంచి చేపడుతున్న కార్యక్రమాలపై ఆరాతీశారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

ఆమనగల్లు: చోరీ కేసులో నేనావత్ చంద్రమోహన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఎస్‌ఐ వెంకటేశ్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. ఆమనగల్లు పట్టణంలోని గాంధీ నగర్ సమీపంలో గత నెల 30న తాళం వేసి ఉన్న రొయ్యల లక్ష్మమ్మ ఇంట్లో దుండగుడు చొరబడి బీరువాను పగల గొట్టాడు. అందులోని 9 తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దొంగను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. చోరీ చేసినట్లు అంగీకరించాడు. అనంతరం అతడి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసులో దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ వెంకటేశ్, కానిస్టేబుళ్లు రఘునాయక్, శివలను ఈ సందర్భంగా సీఐ ప్రమోద్‌కుమార్ అభినందించారు.

ఈక్వెస్ట్రియన్ జాతీయ అర్హత పోటీలు

నేటి నుంచి జన్వాడ పోలో క్లబ్‌లో టోర్నీ



అశ్వంతో హార్డిల్స్‌పై నుంచి జంప్ చేస్తున్న క్రీడాకారుడు

శంకర్‌పల్లి: ఈక్వెస్ట్రియన్ జాతీయ అర్హత పోటీలు నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. టోర్నీకి శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ వేదిక కానుంది. పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్హత పోటీల్లో అండర్–11,14,18 విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననుండగా.. మూడు రకాల పోటీలు పోలో, షో జంపింగ్, డ్రెసాజ్‌లు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత సాధించిన వారికి, దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే జాతీయ జూనియర్ ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కానున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ జాతీయ అర్హత పోటీలకు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందని క్లబ్ సీఈఓ మీర్ హఫీజుద్దీన్ అహ్మద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

స్నేహితురాలు మాట్లాడటం లేదని..



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి విజయలక్ష్మి

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

షాబాద్: స్నేహితురాలు మాట్లాడటం లేదని ఓ విద్యార్థిని స్పిరిట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆమనగల్లు గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీజ.. స్నేహితురాలు తనతో మాట్లాడటం లేదన్న మనస్తాపంతో స్పిరిట్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన ఉపాధ్యాయురాలు.. బాలికను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి నగరంలోని ఉస్మానియాకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్, సీఐ కాంతారెడ్డి, ఎస్‌ఐ రమేష్‌లు పాఠశాలకు వెళ్లారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.